సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 25 । ఆగస్టు । 2024



నేత్రదానంపై అవగాహన

వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లను సమన్వయం చేసి అందరికీ నేత్రదానంపై అవగాహన కల్పిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. 8లో



'ఆర్మీ' ర్యాలీ ఏర్పాట్ల పరిశీలన

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఏర్పాట్లను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి శనివారం పరిశీలించారు. 8లో



వర్షంతో ఉషోదయం!

పక్షం రోజులుగా ఉక్కపోత, ఎండలతో విలవిల్లాడుతున్న విశాఖ వాసులకు శనివారం ఉదయం వర్షం గుడ్ మార్నింగ్ చెప్పింది. 8లో

రాత్రి వేళ సెక్యూరిటీ పెంచాలి



ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, సిబ్బందికి ఇంకా సౌకర్యాలు పెంచాలి. ప్రస్తుతం ఉన్న సదుపాయాలు సరిపోవడం లేదు. రాత్రి వేళల్లో ప్రతి రెండు గంటలకు ఒక సారి ఆస్పత్రిలో పోలీసులు రౌండ్‌లు నిర్వహించాలి. రోగుల కోసం వచ్చే వారి బంధువులు ఆస్పత్రికి తాగి రావడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని నియంత్రించాలి. మహిళల వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపరచడంతో పాటు భద్రత కల్పించాలి. మహిళా ఉద్యోగుల సంరక్షణకు ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ ఇసుకపల్లి వాణి, ప్రొఫెసర్, గైనిక్ విభాగం, కేజీహెచ్

రెస్ట్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి



ఆస్పత్రిలో రోగులకు సేవలు అందించడంలో నర్సుల పాత్ర కీలకంగా ఉంటుంది. వారికి భద్రత, ఇతర సదుపాయాలు ఇంకా పెంచాలి. ప్రస్తుతం నర్సులకు రాత్రి సమయంలో కనీస సెక్యూరిటీ ఉండడం లేదు. రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 వరకు డ్యూటీ వుంటుంది. వార్డుల్లో రౌండ్స్ సమయంలో నర్సులకు రక్షణ కల్పించాలి. నర్సులకు ప్రతీ వార్డులో డ్రెసింగ్ రూమ్ కేటాయించాలి. అలాగే రెస్టు రూమ్‌లు ఏర్పాటు చేయాలి.

– సీహెచ్ పద్మావతి, గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్, కేజీహెచ్

న్యూస్‌రీల్

ఈఎన్‌సీ సందర్శన



ఈఎన్‌సీని సందర్శించిన డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కోర్సు అధికారుల బృందం

మురళీనగర్: ఫార్వర్డ్ ఏరియా టూర్‌లో భాగంగా డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కోర్సు విభాగానికి చెందిన 16 మంది శనివారం తూర్పు నావికాదళం కార్యాలయాన్ని సందర్శించారు. స్థానిక అధికారులతో ట్రై సర్వీస్, ఆపరేషనల్ అంశాలపై చర్చించారు. డీ ఎట్ సీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బాధ్యతల స్వీకరణ



సీఎండీని కలిసిన సీవీవో రామకృష్ణప్రసాద్

సీతమ్మధార: ఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా కింజరాపు రామకృష్ణ ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం విజిలెన్స్ విభాగంలోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమగోదావరి సర్కిళ్ల వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దీర్ఘకాలంగా పరిష్కారం కాని విద్యుత్ సంబంధిత సమస్యలు, విద్యుత్ చౌర్యానికి సంబంధించి టోల్ ఫ్రీ నంబర్ 1912కి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

మరో ఆరుగురు చిన్నారుల డిశ్చార్జ్



డిశ్చార్జ్ అయిన పిల్లలతో డాక్టర్ చక్రవర్తి

మహారాణిపేట: కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మరో ఆరుగురు పాసా ట్రస్ట్ ఆశ్రమ చిన్నారులు శనివారం డిశ్చార్జ్ అయ్యారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలోని పాసా ట్రస్ట్ ఆశ్రమంలో పిల్లలు విషాహారం తిని అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ నెల 19న 38 మంది పిల్లలను కేజీహెచ్‌లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పూర్తిగా కోలుకున్న 26 మందిని శుక్రవారం, ఆరుగురిని శనివారం డిశ్చార్జ్ చేశామని పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి తెలిపారు. మరో నలుగురు ఐసీయూ వార్డులో చికిత్స పొందుతున్నారని వివరించారు.

రేపు వినతుల స్వీకరణ రద్దు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో ఈ నెల 26న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్టు కమిషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించిందని.. ఈ కారణంగా వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కమిషనర్ సూచించారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ నిలుపుదల

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఆర్జిత సెలవులు (ఈఎల్) ఎన్‌క్యాష్‌మెంట్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఈ మేరకు యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2021 నుంచి అధికారులకు 270, కార్మికులకు 170 దాటి ఆర్జిత సెలవులుంటే అందులో ఏడాదికి గరిష్టంగా 30 ఆర్జిత సెలవులను ఎన్‌క్యాష్‌మెంట్ చేసుకునే సదుపాయం ఉండేది. పదవీ విరమణకు ఒక నెల ముందు 30 సెలవులు ఎన్‌క్యాష్‌మెంట్ చేసుకునేవారు. ఇప్పుడు ఈ సదుపాయాలను నిలిపివేశారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఉత్తర్వులు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. ఉక్కు యాజమాన్యం ఇటీవల అధికారుల పెర్క్‌్స‌లో కోత విధిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, తాజాగా మరో ఉత్తర్వు జారీ చేసింది.

నేడు కేంద్ర మంత్రి రాక

మహారాణిపేట: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ఆదివారం విశాఖ రానున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో ఉదయం 8.10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డుమార్గంలో శ్రీకాకుళం వెళతారు.

హెల్దీ తిండి.. కొత్త ట్రెండీ

వీలైతే నాలుగు రకాల స్నాక్స్.. కుదిరితే కప్పు కాఫీ.. సాయంత్రమైతే చాలు. విశాఖ వాసి మదిలో మెదిలో మొదటి ఆలోచన ఇదే. చిరుతిండి.. మన జీవితాల్లో భాగమైపోయింది. టీ తాగుతూ స్నాక్స్.. సాయంత్రం సరదాగా స్నాక్స్.. ఇంటికి చుట్టాలొస్తే స్నాక్స్.. చినుకుపడినా.. సమయమేదైనా.. స్నాక్స్ తిందాం మిత్రమా అన్నట్లుగా చిరుతిళ్లపై మనసు మళ్లిస్తున్నారు. అయితే.. ఈ మధ్య కాలంలో చిరుతిళ్లలోనూ ఆరోగ్యాన్ని వెదుకుతున్నారు. విశాఖ సహా 30 నగరాల్లో స్నాక్స్ విక్రయాలు, ప్రజల ఇష్టాయిష్టాలపై ప్రముఖ స్నాక్స్ తయారీ సంస్థ ఫార్మ్‌లే విడుదల చేసిన ది హెల్దీ స్నాకింగ్–2024 నివేదిక పలు ఆసక్తికరమైన అంశాలను వెల్లడించింది. చిరుతిళ్లలో పోషకాల స్నాక్స్ వేరయా.. అవే మాకు ఇష్టమయా అంటూ 73 శాతం మంది చూసి మరీ తింటున్నారంట. మార్కెట్‌లోకి బెస్ట్ స్నాక్స్ ఏమొచ్చాయో అని ప్రతి 10 మందిలో తొమ్మిది మంది వెతుకుతున్నారని నివేదిక చెబుతోంది.

– సాక్షి, విశాఖపట్నం



- పోషకాలు, పదార్థాలపైనే దృష్టి
- ది హెల్దీ స్నాకింగ్ రిపోర్ట్‌లో ఆసక్తికర అంశాలు
- చిరుతిళ్లలోనూ ఆరోగ్యాన్ని చూస్తున్న 73 శాతం మంది వైజాగ్ వాసులు
- తృణధాన్యాలు, గింజలనే స్నాక్స్‌గా ఆరగిస్తున్న 60 శాతం మంది..



SUNDAY SPECIAL

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా చిరుతిళ్లకు గిరాకీ పెరుగుతోంది. టీ, కాఫీ తాగుతున్నప్పుడు వేడి వేడి సమోసా లేదంటే.. బిస్కెట్లు ఉండాల్సిందే. లంచ్, డిన్నర్‌కి మధ్య స్నాక్స్ టైమ్ ఫిక్సయిపోయింది. అందుకే భారతీయులకు చిరుతిండి ఇష్టంగా మారిపోయింది. అయితే ఇటీవల ఆహార పదార్థాల కల్తీపై ఆందోళనల నేపథ్యంలో.. స్నాక్స్ ఎంపికలోనూ జాగ్రత్త పడుతున్నారు. భారతీయులు ఎలాంటి స్నాక్స్ ఇష్టపడుతున్నారనే వివరాలను తెలుసుకునేందుకు ఫార్మ్‌లే దేశవ్యాప్తంగా 30 నగరాల్లో సర్వే చేసింది. ఈ వివరాలతో ది హెల్దీ స్నాకింగ్–2024 అనే నివేదికను విడుదల చేసింది. నగరంలోనూ సర్వే నిర్వహించగా.. ఆకలేస్తే పక్కనే ఉన్న దుకాణానికి వెళ్లి రెండు బంగాళాదుంప చిప్స్ ప్యాకెట్లు లేదా బేకరీకి వెళ్లి సమోసా తినే రోజులు పోయాయని విశాఖ వాసులు చెప్పారంట.! కొనేది చిన్న ప్యాకెట్ అయినా.. అందులో ఏం ఇంగ్రిడియంట్స్ ఉన్నాయి? వాటిలో పోషకాల విలువెంత? అవి తింటే వచ్చే అనర్థాలేమైనా ఉన్నాయా? ఇలా ప్రతి విషయంలోనూ మిస్టర్ పర్‌ఫెక్ట్‌లమని తెగేసి చెబుతున్నారు.


మార్కెట్ ట్రెండ్.. మారిపోయిందండోయ్..

ప్రస్తుతం ఫుడ్ ప్యాకేజీ మార్కెట్‌ని స్నాక్స్ సంస్థలే శాసిస్తున్నాయి. దేశవ్యాప్తంగా రూ.3.75 ట్రిలియన్ల ఫుడ్ ప్యాకేజీ ఇండస్ట్రీ ఉండగా.. ఇందులో 33.4 శాతం వరకూ స్నాక్స్, స్వీట్స్ పరిశ్రమలు ఆక్రమించేసుకున్నాయి. ఆరోగ్యకరమైన స్నాక్స్‌ని ఇష్టపడుతున్నారని తెలిసి.. వాటి తయారీ పైనే ఆసక్తి చూపిస్తున్నాయి. శరీరంలో తక్కువ కొవ్వు ఉత్పత్తి చేసే పాపింగ్, బేకింగ్, ఎయిర్‌ఫ్రైయింగ్, వాక్యూమ్ ఫ్రైయింగ్ మొదలైన ప్రాసెస్ విధానంలో తయారు చేసే స్నాక్స్ ఎక్కువగా మార్కెట్‌లో కనిపిస్తున్నాయి. ముఖ్యంగా డీప్ ఫ్రై చేసిన స్నాక్స్‌తో పోలిస్తే 75 శాతం కేలరీలను తగ్గిస్తాయనే ఉద్దేశంతో ఎయిర్ ఫ్రయర్ స్నాక్స్‌కే మొగ్గు చూపుతున్నారు.

మిల్లెట్ల వైపు దృష్టి..

ఇప్పుడిప్పుడే స్నాక్స్ ప్లేస్‌లో మిల్లెట్స్ వినియోగిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. సాయంత్రం సమయంలో బిస్కెట్, సమోసా, బజ్జీ, ఆలూ చిప్స్ మొదలైన వాటి స్థానాలను బాదం, పిస్తా, ఖర్జూరం, జీడిపప్పు, తృణధాన్యాలు, మొలకలు ఆక్రమించేస్తున్నాయి. కొన్ని సంస్థలు ఈ మిల్లెట్స్‌ను ప్యాకేజింగ్ ఫుడ్‌గా మార్చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. 2025 నాటికి మిల్లెట్ స్నాక్స్ 20 శాతానికి చేరుతాయని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ అంచనా వేస్తోంది.

బ్రాండెడ్ స్నాక్స్ కావాలి



ఒకప్పుడు స్నాక్స్ ప్యాకెట్ తీసుకుంటే కేవలం ఎక్స్‌పైరీ డేట్ మాత్రమే చూసేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. స్నాక్స్ కొనుగోలు చేసినప్పుడు ఫస్ట్ అవి బ్రాండెడ్ సంస్థలు తయారు చేస్తున్నాయా లేదా అని చూస్తున్నారు. అంతేకాదండోయ్.. ప్రతి 100 మందిలో 73 మంది మాత్రం అందులో పోషకాలు ఏం ఉన్నాయి.? సోడియం కంటెంట్ ఎంత ఉంది.? అవి తినడం వల్ల కొవ్వు శరీరంలో పెరుగుతుందా లేదా.? ఆరోగ్యానికి హానికరమైన ముడిపదార్థాలేమైనా ఉన్నాయా అనేది కచ్చితంగా చెక్ చేస్తున్నారు.

విశాఖలో సర్వే సాగిందిలా..

అభిప్రాయం తెలిపిన వారు **6,000**
టీ, కాఫీ తాగే సమయంలో స్నాక్స్ తినడం ఇష్టమన్న వారు **70** శాతం
లేబుల్ చదివి స్నాక్స్ తీసుకునే వారు **73** శాతం
స్నాక్స్‌కి ప్రత్యామ్నాయం వెతుకుతున్న వారు **10** మందిలో **9** మంది
చిరుతిళ్లలో మిల్లెట్లు, పప్పు గింజలకు ప్రాధాన్యమిస్తున్న వారు **60** శాతం
మఖానా, డ్రైఫ్రూట్స్ ఎంపిక చేసుకుంటున్న వారు **67** శాతం
ఆరోగ్యకరమైన స్నాక్స్ ఖరీదని చెబుతున్న వారు **58** శాతం

స్నాక్స్ ప్లేస్‌ను పప్పుగింజలు ఆక్రమించుకుంటున్నాయి

ఒకప్పుడు ఇంట్లో స్నాక్స్ తయారు చేసి.. వాటినే తినేవారు. ఇప్పుడు కాలం మారిపోయింది. ప్యాకేజ్డ్ స్నాక్స్ రావడంతో వాటిపైనే మొగ్గు చూపుతున్నారు. ఇవి ఆరోగ్యానికి హానికరమని తెలుసుకున్నారు. దీంతో స్నాక్స్ స్థానాన్ని పప్పుగింజలు ఆక్రమించేసుకున్నాయి. ముఖ్యంగా బాదం, పిస్తా వంటివాటికే ఓటేస్తున్నారు. ప్రోటీన్, కాంప్లెక్స్, కార్బోహైడ్రేట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు తగినంతగా ఉండేలా చూసుకోవడం చాలా ముఖ్యం. యాంటీఆక్సిడెంట్, విటమిన్ ఈ వంటివి ఉండే బాదంను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. తృణధాన్యాలు, పప్పుగింజలు పోషకాలు అవసరమైన విటమిన్లు, ఖనిజాలను కలిగి ఉంటాయి. అందుకే చిరుతిళ్లలో పప్పుగింజలు తీసుకునేవారి సంఖ్య పెరుగుతోంది.

–షీలా కృష్ణస్వామి, పోషకాహార నిపుణురాలు



గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో సీపీ బాగ్చి, జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: గణేష్ మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ మీటింగు హాల్‌లో పోలీస్ కమిషనర్, జాయింట్ కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పొల్యూషన్ బోర్డులు జారీ చేసిన నిబంధనలను అందరూ పాటించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణ హితంగా వేడుకలను నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. విగ్రహాల తయారీ, అలంకరణలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడవద్దని సూచించారు. పీవోపీ విధానంలో అలంకరణ, ఇతర ప్రక్రియలను నిర్వహించవద్దని చెప్పారు. వాయు, శబ్ద, జల కాలుష్యం లేకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించాలన్నారు.

అనుమతుల జారీకి సింగిల్ విండో డెస్క్

గణేష్ మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణకు అనుమతులు జారీ చేసేందుకు కలెక్టరేట్‌లో సింగిల్ విండో డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని, ఈ నెల 25వ తేదీ నుంచి అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ తెలిపారు. పోలీసు, జీవీఎంసీ, విద్యుత్, పొల్యూషన్ తదితర విభాగాల అధికారులతో ఈ డెస్క్ పని చేస్తుందన్నారు. అన్ని రకాల నిబంధనలను పాటించి అనుమతులు జారీ చేస్తారని స్పష్టం చేశారు. నిర్వాహకులు అనుమతులు తీసుకునే సమయంలోనే నిమజ్జనం తేదీని తెలపాల్సి ఉంటుందన్నారు. నిమజ్జన సమయంలో అందరూ జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. ఈ సమావేశంలో సీపీ బాగ్చి, డీసీపీ ఫకీరప్ప,జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, జేసీ మయూర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

సబ్బవరం: డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మిగిలి ఉన్న సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ తెలిపారు. 5వ తరగతిలో బాలుర ఎస్సీ కేటగిరీలో ఖాళీగా ఉన్న 17 సీట్లను భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. 2023–24 లో 4వ తరగతి చదివిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆధార్,కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డుతో ఈ నెల 27న నేరుగా పాఠశాలలో సంప్రదించాలని తెలిపారు.

సేఫ్టీ ఆడిట్ నిర్వహించి లోపాలను సరిదిద్దండి


పరిశ్రమల యాజమాన్యాలకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో సీపీ బాగ్చి, కమిషనర్ సంపత్‌కుమార్

మహారాణిపేట: కార్మికులు, ఉద్యోగుల భద్రత, రక్షణకు ప్రథమ ప్రాధాన్యమిస్తూ.. పరిశ్రమలు నిర్వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ స్పష్టం చేశారు. పని చేసే చోటే వారికి అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. ఇటీవల ఫార్మా కంపెనీల్లో జరిగిన ప్రమాదాల నేపథ్యంలో జిల్లాలోని 57 పరిశ్రమల నిర్వాహకులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో శనివారం ఆయన సమావేశమయ్యారు. ముందుగా అచ్యుతాపురం ఫార్మా ప్రమాద మృతులకు కలెక్టర్‌తో పాటు అధికార యంత్రాంగం సంతాపం తెలిపింది. ప్రమాదంలో 17 మంది చనిపోవడం విచారకరమని, వారి కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజుల్లోగా అన్ని పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని, లోటుపాట్లను గుర్తించి సరి చేయాలన్నారు. సెప్టెంబర్ 30లోగా అన్ని చోట్లా మాక్ డ్రిల్స్ నిర్వహించాలని, ప్రమాదాలపై కార్మికులకు, సమీప నివాసితులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి కంపెనీ పరిసరాల్లో అలారం వ్యవస్థ ఉండాలని స్పష్టం చేశారు. పారామెడిక్ సిబ్బంది, సేఫ్టీ ప్రోటోకాల్ పాటిస్తూ నైపుణ్యం కలిగిన ఓ ఇన్‌చార్జిని నియమించుకోవాలన్నారు. అనుకోని ఘటనలు సంభవించినప్పుడు స్వీయ రక్షణ పొందేలా కార్మికులు, ఉద్యోగులకు శిక్షణ ఇప్పించాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగినప్పుడు సమాచార మార్పిడి, ప్రమాద నివారణ సూచనలను పంచుకోవడానికి వీలుగా ఒక పోర్టల్ తీసుకొస్తామని, అందరికీ లాగిన్ ఐడీలు ఇస్తామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని అన్ని పారిశ్రామిక యూనిట్లలో సంబంధిత విభాగాల అధికారులు తరచూ తనిఖీలు చేపట్టాలని.. లోపాలుంటే తక్షణమే సరిదిద్దేలా యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. త్వరలోనే జాయింట్ తనిఖీ బృందాన్ని నియమిస్తామన్నారు. అక్టోబర్‌కు అన్ని రకాల వసతుల కల్పన ప్రక్రియను ఆయా పరిశ్రమల్లో పూర్తి చేయాలన్నారు. ఎన్‌జీటీ ప్రమాణాలకు అనుగుణంగా వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ చేపట్టాలన్నారు. కొంతమంది నేరుగా వ్యర్థాలను కాలువలు, సముద్రంలో విడిచి పెడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతిస్పందన, స్వీయ రక్షణపై కార్మికులు, ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. సేఫ్టీ మెకానిజం అభివృద్ధి చేయాలని, కాలం చెల్లిన యంత్రాలను మార్చాలన్నారు. యాజమన్యాలు సమీప గ్రామాల ప్రజలు, నివాసితులతో సత్సంబంధాలు పెంచుకోవాలని, ప్రమాదాలు జరిగినప్పుడు వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పించాలన్నారు. జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, జాయింట్ పోలీస్ కమిషనర్ కె.ఫకీరప్ప, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేశ్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి గణపతి, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బృహత్తర ప్రణాళిక రహదారి పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: వీఎంఆర్డీఏ చేపట్టిన పలు అభివృద్ధి ప్రాజెక్టులు, పనులను మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పరిశీలించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా శనివారం ఎన్‌హెచ్–16 నుంచి దివీస్ ల్యాబ్స్ వరకు ప్రతిపాదించిన బృహత్తర ప్రణాళిక రహదారి ప్రస్తుత పరిస్థితిని గమనించారు. అనంతరం అన్నవరంలో సంస్థకు చెందిన భూములను, కొంగవానిపాలెం ఏపీఐఐసీకి చెందిన లేఅవుట్, రఘుమండలో 22 ఎకరాలు, జియ్యన్నవలసలో 12.30 ఎకరాలు, గరివిడిలో 22 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్లను సందర్శించారు. అందులో జరుగుతున్న మౌలిక వసతుల పనులను పరిశీలించారు. ఇంజినీర్లకు మార్పులు, చేర్పులు సూచించారు. త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విజయనగరంలో ఆనందగజపతి ఆడిటోరియాన్ని సందర్శించారు. ఈ పర్యటనలో ముఖ్య ప్రణాళికాధికారి సంజయ్ రత్నకుమార్, ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, ఈఈ బలరామ రాజు, ప్లానింగ్ అధికారి వేంకటేశ్వరరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ బొట్టా శ్రీనివాసరావు, సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు అప్పారావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాత కేసులకు కొత్త నోటీసులు!

2014లో ఏసీబీ కేసు ఆధారంగా 14 మందికి జారీ

మహారాణిపేట: పాత కేసులకు సంబంధించి తాజాగా జారీ చేసిన నోటీసులు కేజీహెచ్ ఉద్యోగుల్లో కలకలం రేపుతున్నాయి. గతంలో అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొన్న 14 మందికి సూపరింటెండెంట్ నోటీసులు జారీ చేశారు. 2014లో ఫార్మసీ విభాగంలో మందుల కొనుగోలు, రేడియాలజీ విభాగంలో అక్రమాలు జరిగినట్టు ఏసీబీ గుర్తించింది. ఇందులో 14 మంది ప్రమేయం ఉందని ప్రభుత్వానికి నివేదించింది. తాజాగా డీఎంఈ ఆదేశాల మేరకు సంబంధిత ఉద్యోగుల నుంచి వివరణ కోరారు. పది రోజుల వ్యవధిలో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇందులో ఎక్కువ మంది వివిధ విభాగాలకు బదిలీ కాగా, మరి కొందరు పదోన్నతులు పొందారు. ఒకరు చనిపోయారు.

విశాఖకే వన్నె తెచ్చిన 'కళాభారతి'

- మిజోరం గవర్నర్ హరిబాబు
- సంగీత కళానిధి ఏకేసీ నటరాజన్‌కు నాద విద్యాభారతి అవార్డుతో సత్కారం



నటరాజన్‌ను సత్కరిస్తున్న గవర్నర్ హరిబాబు, వైభవ్ జ్యూయలర్స్ అధినేత గ్రంధి మల్లికా మనోజ్

మద్దిలపాలెం: దేశ, విదేశాల్లో గల కళాకారులు, వారి ప్రతిభాపాటవాలకు వేదికగా నిలుస్తూ విశాఖకే వన్నె తెచ్చిన కళాభారతి విశేష ఖ్యాతిని ఆర్జించిందని మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 38వ వార్షికోత్సవ జాతీయ నృత్య సంగీత వేడుకలు శనివారం కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ హరిబాబు, వైస్ అడ్మిరల్ పెంధార్కర్ చేతుల మీదుగా సంగీత కళానిధి, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఏకేసీ నటరాజన్‌కు నాద విద్యాభారతి జాతీయ పురస్కారం అందజేశారు. అనంతరం రూ.రెండు లక్షల విలువైన స్వర్ణ కమలంతోపాటు రూ.లక్ష నగదుతో ఘనంగా సత్కరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ సుసర్ల గోపాల శాస్త్రి సంకల్పబలంతో కళాభారతి రూపుదిద్దుకుందని గుర్తు చేశారు. దేశ, విదేశాలలో ప్రఖ్యాత కళాకారులను రప్పించి విశాఖ కళాభారతిలో ప్రదర్శనలు ఇప్పించారన్నారు. వైస్ అడ్మిరల్ పెంధార్కర్ మాట్లాడుతూ ప్రాచీన కళలను కాపాడుకోవాలన్నారు. అలాంటి కళలను నేటి తరానికి అందించడానికి కళాభారతి సభ్యులు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. కళాభారతి అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్. రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు మాట్లాడుతూ రూ.రెండు లక్షల విలువైన స్వర్ణకమలంను వైభవ్ జ్యూయలర్స్ అధినేత గ్రంధి మల్లికా మనోజ్ అందించారని తెలిపారు. తొలి రోజు కార్యక్రమానికి ఎస్ఆర్‌కే ప్రాజెక్ట్స్ చైర్మన్ మంతెన సత్యనారాయణ రాజు ఆర్థిక సాయమందించారన్నారు. అనంతరం అవార్డు గ్రహీత ఏకేసీ నటరాజన్ క్లారినెట్ కచేరీని అద్భుతంగా చేసి అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో పైడా కృష్ణాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైద్యుల నిర్లక్ష్యంపై బాధితురాలికి రూ.21.6 లక్షల పరిహారం

దాబాగార్డెన్స్: అపోలో ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంపై వినియోగదారుల రక్షణ చట్టంతో ఒక బాధితురాలు రూ.21.6 లక్షల నష్టపరిహారం పొందారని సుప్రీంకోర్టు న్యాయవాది, అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్నెస్ (ఆశ్రా) వ్యవస్థాపకుడు హబీబ్ సుల్తాన్ అలీ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడారు. ఒక మహిళ 2011లో కడుపునొప్పితో అపోలో ఆస్పత్రిలో చేరితే గాల్‌బ్లాడర్ తొలిగించి ఆపరేషన్ చేసినట్టు ఆస్పత్రి వర్గాలు తెలిపాయన్నారు. వేరే సమస్యతో అదే ఆస్పత్రికి 2020లో వెళ్తే... శరీరంలో గాల్‌బ్లాడర్ ఉందని, అందులో రాళ్లున్నాయని రిపోర్ట్ ఇచ్చారన్నారు. దీంతో ఆ మహిళ మోసపోయానని వినియోగదారుల కోర్టులో కేసు నమోదు చేయడంతో 21.60 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించినట్లు చెప్పారు. గతంలో లాజరస్ ఆస్పత్రిలో కూడా వైద్యుల నిర్లక్ష్యం వల్ల ఒక రోగి రూ.29 లక్షల నష్టపరిహారం పొందడాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కార్పొరేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు చేయాలని కోరారు. సమావేశంలో ఆశ్రా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు, న్యాయవాది తోట శత్రుఘ్నుడు, సభ్యులు మహ్మద్ ఇక్బాల్, జి.కిషోర్‌కుమార్, ఎండీ నజీమ్, జి.శ్యామలాదేవి, పి.హైమా, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

'ఆ హబ్'పై అసత్య ప్రచారాలు నమ్మొద్దు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏర్పాటైన 'ఆ హబ్'పై అసత్య ప్రచారాలు నమ్మొద్దని హబ్ సీఈవో రవి ఈశ్వరపు ఓ ప్రకటనలో తెలిపారు. అతితక్కువ కాలంలో దేశంలోని ఇంక్యుబేషన్, స్టార్టప్ కేంద్రాలకు దీటుగా అత్యుత్తమ ప్రగతి సాధిస్తున్న ఏయూ ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్‌పై కొంత మంది ఉద్దేశపూర్వకంగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఆ హబ్ కేంద్రంగా పని చేస్తున్న స్టార్టప్ సంస్థలను ఖాళీ చేసి వెళ్లాలని చెప్పినట్లుగా కొంత మంది ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలా వెళ్లమని ఎవరికీ చెప్పలేదని స్పష్టం చేశారు. ఏయూ పాలకులతో సమన్వయం చేస్తూ దేశంలోని అతిపెద్ద మల్టీ డిసిప్లీనరీ ఇంక్యుబేషన్ ఎకోసిస్టంగా ఆ హబ్‌ను తీర్చిదిద్దుతామన్నారు. టెక్ ఇంక్యుబేషన్‌తో పాటు బయోటెక్, ఫార్మా, మెరైన్, ఫుడ్, జీనోమిక్స్, ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్, ఉమెన్, గ్రామీణ రంగాల్లో స్టార్టప్‌లు పని చేస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో ఇంక్యుబేషన్ రంగంలో అత్యుత్తమ స్థానాన్ని ఆ హబ్ సాధించిందన్నారు. ఆ హబ్ సేవలను మారిషస్, శ్రీలంకలో ప్రారంభించిందని, త్వరలో హైదరాబాద్‌లో కూడా సేవలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఏయూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ రెండేళ్లలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకునే విధంగా పనిచేస్తామన్నారు.



మందుబాబుల సంచారం తగ్గించాలి

ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, ఇతర సిబ్బందికి భద్రత, పోలీసు నిఘా వ్యవస్థ పెంచాలి. నిఘా ఉంటే అరాచకాలకు పాల్పడే వ్యక్తుల సంఖ్య తగ్గుతుంది. ఆస్పత్రుల పరిసరాల్లో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఇటీవల కాలంలో ఆస్పత్రులకు రోగుల బంధువులు మద్యం సేవించి వస్తున్నారు. అందువల్ల ఆస్పత్రుల్లోనూ బ్రీత్ ఎనలైజర్లు పెట్టి తనిఖీలు చేయాలి. దీని వల్ల మందుబాబుల సంచారం తగ్గుతుంది.

– డాక్టర్ రాధాకృష్ణ, డిప్యూటీ సూపరింటెండెంట్, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి (హెచ్‌వోడీ), కేజీహెచ్





వార్డుల్లో భద్రతా సిబ్బంది అవసరం

ఆస్పత్రులకు ఎక్కువగా కేసులు వచ్చే సమయంలో నర్సులపై ఒత్తిడి అధికంగా ఉంటోంది. కొన్ని ప్రమాదకరమైన కేసులు వచ్చే సమయంలో రోగితోపాటు వారి బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. వార్డులో అంత మంది ఉండొద్దన్నా వినిపించుకోవడం లేదు. దీనివల్ల ఇతర రోగులకు ఇబ్బందిగా ఉంటుంది. అందువల్ల ప్రతి వార్డులో భద్రతా సిబ్బంది వుండాలి. రాత్రి సమయంలో మహిళా నర్సులకు భద్రత లేదు. ప్రత్యేక రూములు, డ్రెస్సింగ్ రూమ్‌లు లేవు. నర్సుల కోసం ప్రత్యేకంగా డ్రెస్సింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి

– ఎన్.ప్రశాంతి, హెడ్ నర్సు, కేజీహెచ్

చిత్తశుద్ధితో ప్రజా సమస్యల పరిష్కారం

అధికారులకు జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఆదేశం

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లపల్లి సుభద్ర ఆదేశించారు. అచ్యుతాపురంలోని ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో బాధితులకు సరైన అంబులెన్స్ సదుపాయం లేక బస్సుల్లో తరలించడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. పరిశ్రమలు ఉన్నచోట యాజమాన్యంతో మాట్లాడి ఆస్పత్రులు, అంబులెన్సుల సదుపాయం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సుభద్ర అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమ పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, వైద్య ఆరోగ్యంపై చర్చించారు. వివిధ శాఖల అధికారులు సంబంధిత ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు వేయగా ఆయా శాఖల అధికారులు బదులిచ్చారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ కోటవురట్ల మండలం కైలాసపట్నం సంఘటన, ఫార్మా ప్రమాద సమయంలో బాధితులకు వైద్యులు అందించిన సేవలు ప్రశంసనీయమని కితాబిచ్చారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేయాలి

ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ గిరిజన ప్రాంతంలో చేయూత పథకం ఇంకా కొందరికి అందలేదనే ఫిర్యాదులు వస్తున్నాయని సుభద్ర అన్నారు. అలాగే గృహ నిర్మాణాల బిల్లులు చెల్లించలేదని, ఇదివరకే దరఖాస్తు చేసుకున్నప్పటికీ కొత్త గృహాలు మంజూరు కాలేదని కూడా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇళ్లు మంజూరు చేసి లబ్ధిదారులకు అందజేయాలని ఆమె కోరారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన గృహ పథకాలు కొనసాగుతాయని, పెండింగ్‌లో ఉన్న గృహ లబ్ధిదారులు ఈకేవైసీ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉందని అధికారులు వివరించారు. గ్రామ సభల్లో తీర్మానం చేసిన పనులపై ఆరా తీసిన ఆమె జెడ్పీటీసీ సభ్యులకు సమాచారమివ్వాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతులు పూర్తి చేయాలని, గిరిజన ప్రాంతాల్లో సిల్వర్ ఓక్‌తోపాటు వాణిజ్య పంటల సాగు ప్రోత్సహించాలని, కాఫీతోపాటు జీడి, మిరియాల పంటలు పండించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో 5వ స్థాయీ సంఘ చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ, జెడ్పీ సీఈవో డి.సత్యనారాయణ, అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యురాలిపై హత్యాచారం దారుణం

మల్కాపురం: కోల్‌కతాలో వైద్యురాలిపై మానవ మృగాల దాడి, హత్యాచారం చాలా దారుణమని మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రశాంతి ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యురాలి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కళాశాల ఆవరణలో విద్యార్థినులు శనివారం నాటిక ప్రదర్శించారు. ఈ నాటిక చూపరులను కంటతడి పెట్టించింది. అనంతరం ప్రశాంతి మాట్లాడుతూ ఇలాంటి ఘటనలకు పాల్పడే నిందితులను పాలకులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తప్పు చేయాలంటే భయపడేలా చేస్తే ఇలాంటి ఘటనలు పునరావృతం కావన్నారు. కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైక్రోబయాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.



వైద్యురాలిపై దాడిని కళాశాలలో నాటిక రూపంలో ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఏర్పాట్ల పరిశీలన

మహారాణిపేట: ఈ నెల 25వ తేదీ అర్ధరాత్రి నుంచి ప్రారంభంకానున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఏర్పాట్లను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ శనివారం పరిశీలించారు. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. డైమండ్ జూబ్లీ స్టేడియంలో మెయిన్ ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్న నేపథ్యంలో అక్కడి పరిస్థితులను గమనించారు. ట్రాక్ పునరుద్ధరణ, బారికేడ్లు, లైట్లు, టెంట్లు సునిశితంగా పరిశీలించారు. అధికారులు, ఇతర సిబ్బంది ఉండేందుకు ఏర్పాటు చేస్తున్న వసతి కేంద్రాన్ని, ఎంపిక సమయంలో కూర్చునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన కౌంటర్లను చూశారు. ర్యాలీ ప్రారంభం నాటికి పనుల్లో పెండింగ్ లేకుండా ముందుగానే పూర్తి చేసుకోవాలని అధికారులకు సూచించారు. సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ఎంపిక ప్రక్రియకు వచ్చే వారికి ముందస్తు సమాచారం అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ, రెవెన్యూ, పోలీస్, ఈపీడీసీఎల్, వైద్య విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, ర్యాలీని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన సీపీ

విశాఖ సిటీ: పోర్టు స్టేడియంలో సెప్టెంబర్ 5 వరకు నిర్వహించనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించి భద్రతా ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శనివారం పర్యవేక్షించారు. ర్యాలీ జరిగే స్టేడియానికి వెళ్లి ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తొక్కిసలాటకు అవకాశం లేకుండా బారికేడింగ్, ఇతర చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్మీ అధికారులతో ఇతర భద్రతా ఏర్పాట్లపై చర్చించారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభం

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి చంద్రనగర్‌కు వెళ్లే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు రూ.12.69 కోట్లతో త్వరలో ప్రారంభించనున్నట్లు వాల్తేర్ రైల్వే డివిజినల్ మేనేజర్ సౌరభ్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడి బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడం, సింహాచలం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చేపడుతున్న నేపథ్యంలో ఎఫ్‌వోబీ అభివృద్ధికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ బ్రిడ్జి పనుల కోసం గత ఏడాది డిసెంబర్ 9న అప్పటి రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. 1.8 మీటర్ల వెడల్పుతో ఉన్న పాత బ్రిడ్జి స్థానంలో 3 మీటర్ల వెడల్పు, 115 మీటర్ల పొడవుతో కొత్తది నిర్మించనున్నారు. ఇటీవల రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ సైతం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు.

సింహాచలం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగు పరిచేందుకు రైల్వే శాఖ శ్రీకారం చుట్టిందని తెలిపారు. వరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ విశిష్టతను ప్రతిబింబించేలా స్టేషన్ కొత్త భవనం నిర్మించనున్నామని, అదనపు పార్కింగ్, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. అలాగే రెండో వైపు ప్రయాణికులు రాకపోకలు సాగించే విధంగా ద్వారాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

వర్షంతో ఉషోదయం!

సాక్షి, విశాఖపట్నం: పక్షం రోజులుగా ఉక్కపోత, ఎండలతో విలవిల్లాడుతున్న విశాఖ వాసులకు శనివారం ఉదయం వర్షం కురిసి గుడ్ మార్నింగ్ చెప్పింది. ఉదయాన్నే సూరీడు కనిపించకుండా మబ్బుల వాతావరణం ఒక్కసారిగా కమ్మేసింది. 7.30 గంటల సమయంలో నగరమంతటా మోస్తరు వర్షం కురిసింది. స్కూల్‌కు బయలుదేరే సమయంలో కురిసిన వర్షం కారణంగా.. విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల రహదారులు జలమయమయ్యాయి. గంట సమయం పాటు వర్షం కురవడంతో.. ట్రాఫిక్‌కు అక్కడక్కడా అంతరాయం ఏర్పడింది. అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా.. అక్కడ నుంచి తేమగాలులు రాష్ట్రంపైకి బలంగా వీస్తున్నాయి. ఈ కారణంగా వర్షాలు మొదలయ్యాయి. మరో రెండు రోజులపాటు అర్ధరాత్రి లేదా ఉదయం సమయంలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో వర్షాలు కురిసే సూచనలున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నగరంలో సగటున 11 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



వస్త్ర ప్రదర్శన ప్రారంభం



వస్త్ర ప్రదర్శనలో సందర్శకులు

బీచ్‌రోడ్డు: దేశీ కళా అథెంటిక్ లూమ్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని ది గేట్ వే హోటల్‌లో సిల్క్ ఇండియా హ్యాండ్లూమ్ వస్త్ర ప్రదర్శన శనివారం ప్రారంభమైంది. ఈ నెల 29 వరకు రోజూ ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 9.30 వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు సతీష్ కుమార్ తెలిపారు. కృష్ణాష్టమి, వినాయక చవితి, వెడ్డింగ్ సీజన్ సందర్భంగా కొత్త కలెక్షన్స్, ఎక్కువ వెరైటీస్‌ను ప్రదర్శనలో వుంచామని తెలిపారు. సుమారు 20 రాష్ట్రాల నేతన్నలు నైపుణ్యం, శ్రమతో వీటిని తీర్చిదిద్దారని, వారిని ప్రోత్సహించాలని కోరారు.

సింహాద్రప్పడు సంస్మరణ సభ నేడు

మురళీనగర్: ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కుల కోసం పోరాడిన దివంగత గుల్లిపల్లి సింహాద్రప్పడు సంస్మరణ సభ ఆదివారం నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య (257) శనివారం తెలిపింది. మాధవధారలోని కల్యాణ మండపంలో ఉదయం సభ నిర్వహిస్తామని, ఎమ్మెల్సీలు పాకలపాటి రఘువర్మ, వేపాడ చిరంజీవిరావు, ఆర్‌జేడీ బి.విజయభాస్కర్ పాల్గొంటారని చెప్పారు.

నేత్రదానంపై అవగాహన కల్పిస్తాం

సీతమ్మధార: మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లను సమన్వయం చేసి అందరికీ నేత్రదానంపై అవగాహన కల్పిస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జగదీశ్వరరావు అన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేత్రదానంపై అవగాహన కోసం 15 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీలక్ష్మి, ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకు మేనేజర్ అభిజిత్ జైన్, పారా మెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్స్ ఉమా శ్రీనివాస్, ఆర్.సురేష్, ఐ డొనేషన్ కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత పాల్గొన్నారు.

రైల్వే అధికారులతో ఎంపీ సమీక్ష

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేజోన్, పలు రైల్వే ప్రాజెక్టులపై డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్‌తో స్థానిక కార్యాలయంలో ఎంపీ శ్రీ భరత్ శనివారం చర్చించారు. విశాఖలోని పోర్టులు, స్టీల్‌ప్లాంట్, ఇతర పరిశ్రమలు రైల్వే మార్గాల ద్వారా భారీగా సరకు రవాణా చేస్తున్నందున ప్రత్యేక లైన్ల ఏర్పాటు, రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఎంపీ చర్చించారు. దువ్వాడ స్టేషన్‌లో వందే భారత్‌కు హాల్ట్ కల్పించాలని, విశాఖ – బెంగళూరు – విశాఖ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను వారానికి మూడు రోజులు నడిపించేలా చర్యలు చేపట్టాలని కోరారు. డివిజినల్ ఇంజినీర్ జగదీశ్వరరావు, ఆపరేషన్స్ మేనేజర్ తన్మయ్, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి సునీత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, మాజీ ఎమ్మెల్యే గండిబాబ్జీ పాల్గొన్నారు.